## ఓటర్ల జాబితా అవకతవకలను అరికట్టాలి

### రాజ్యసభ మాజీ సభ్యులు తులసిరెడ్డి

**మదనపల్లె, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :**



సంతకాల సేకరణలో తులసిరెడ్డి

ఎన్నికల కమీషన్ సమర్థవంతంగా పనిచేసే ఓట్ల చోరీని, ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలను అరికట్టాలని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని బెంగుళూరు బస్టాండులో కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ నాయకులు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజం సక్రమంగా నడవాలంటే ఏదో ఒక వ్యవస్థ అవసరమని, అందులో పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ మన దేశానికి అనుకూలంగా ఉంటుందని రాజ్యాంగ నిర్మాతలు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను ఇచ్చారన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికలు ప్రాణవాయువని అటువంటి ఎన్నికలకు అవకతవకలు లేని ఓటర్ల జాబితా గుండెకాయలాంటిదన్నారు. అలాంటిది ఓటర్ల జాబితా తప్పుల తడకగా తయారైందని ఎన్నికల్లో డబ్బు పంపిణీ విచ్చలవిడిగా సాగుతోందని వారు ఆవేదన చెందారు. బిజెపి అనుకూలంగా లేని ఓటర్లను తొలగించడం జరిగిందన్నారు. భారీ స్థాయిలో దొంగ ఓట్లు చేర్చడం జరిగిందన్నారు. బీహార్‌లో తనకు అనుకూలంగా ఓట్లు పడవన్న బూతుల నుంచి 65లక్షల మంది ఓటర్లను జాబితా నుండి తొలగించారన్నారు. ఎన్నికల కమీషన్ బిజెపి చేతులో కీలుబొమ్మగా మారిందన్నారు. నెలరోజులు పాటు సంతకాల సేకరణ ఉద్యమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ ఎస్.కె.బాషా, మీనాకుమారి, సోమశేఖర్, మనోహర్, ముభారక్, నాగరాజు, అమరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

**మదనపల్లె, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :**



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రామసముద్రం మండలం పెద్దకురపల్లె గ్రామ పంచాయితీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో నవరాత్రులు సందర్భంగా మంగళవారం వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ఉదయమే అభిషేకం, అర్చన, పూల అలంకరణలు పూజారి వికె.రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామిని కొండామఱ్ఱి దామోదరరెడ్డి, గౌతమి, హేమలత, శ్రావన్‌కుమార్‌రెడ్డి, భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## దసరా ఉత్సవాల్లో పాల్గొన్న తులసి రెడ్డి

**వేంపల్లి: సెప్టెంబర్ 30 (ప్రభాత వార్త):**



వేంపల్లి ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలి సంఘం, శ్రీ వాసవి కళ్యాణ మండపం కమిటీ ఆహ్వానం మేరకు రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి సోమవారం వేంపల్లి అమ్మవారి శాలలో దసరా వేడుకల్లో పాల్గొన్నారు. మహా మంగళ హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. వాసవి మాతను, సరస్వతి దేవి అలంకరణలో ఉన్న దుర్గామాతను తులసిరెడ్డి దర్శించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ చెడు మీద మంచి సాధించే విజయానికి సంకేతంగా,లోక కంటకుడైన మహిషాసురుని దుర్గాదేవి సంహరించిన సందర్భాన్ని పురస్కరించుకొని దసరా పండుగ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్, ఉత్తన్న, రమణ,చిన్నకోట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి నృత్య పోటీలలో విద్యార్థుల ప్రతిభ

**వేంపల్లె: సెప్టెంబర్ 30 (ప్రభాత వార్త):**




యునైటెడ్ స్కూల్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి నృత్య పోటీలలో వేంపల్లెకు చెందిన నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచినట్లు నారాయణ విద్యాసంస్థల అధినేత కొట్టే నారాయణరెడ్డి తెలిపారు. భారతీయ జానపద నృత్యాలను ప్రోత్సహించడానికి పులివెందులలో యుఎస్ఓ వారి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గ్రూప్ డ్యాన్స్ లో మేఘన గ్రూప్ వారు వేసిన లంబాడీ నృత్యానికి జాతీయ స్థాయిలో తృతీయ స్థానం మరియు సోలో డ్యాన్స్ లో ముల్ల యాస్మిన్ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. వీరికి రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఏ.పి. మార్క్ ఫెడ్ చైర్మన్ శశి భూషన్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. చదువు తో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని కొట్టె నారాయణ రెడ్డి తెలిపారు.

## ఘనంగా దుర్గాష్టమి వేడుకలు



**వాల్మీకిపురం, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**

వాల్మీకిపురం మండలం, గండబోయినపల్లి గ్రామంలో శ్రీ సత్తెమ్మ తల్లి ఆలయంలో దుర్గాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఆలయ కమిటీ చైర్మన్ పులి సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రత్యేకంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంలో పీలేరు నియోజకవర్గం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తమ కుటుంబ సమేతంగా హాజరై, అమ్మవారికి ప్రత్యేక అర్చనలు చేయించుకోవడం విశేషం. తరువాత ఆలయ కమిటీ తరఫున మీడియా ప్రతినిధులను శాలువా కప్పి సత్కారం చేసి ఘనంగా గౌరవించారు. సమాజానికి అహర్నిశలు సేవలందించే మీడియాను గౌరవించడం ద్వారా ఈ వేడుకలు మరింత ప్రత్యేకత సంతరించుకున్నాయి. ఈ వేడుకలో పీలేరు నియోజకవర్గం నుండి పలు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## అంతిమ విజయం న్యాయానిదే

### మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

**వాల్మీకిపురం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:**



విజయం న్యాయానిదేనని ఎంపీ మిథున్ రెడ్డి విషయంలో మరోసారి రుజువైందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి జైలు నుంచి విడుదలైన సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ జరగని లిక్కర్ స్కామ్ ను కూటమి సర్కారు సృష్టించి అత్యంత ప్రజాధరణ కలిగిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అక్రమంగా అరెస్టు చేసి సుమారు 71 రోజులు నిర్బంధించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తున్నారనే అక్కసుతో, ప్రజల దృష్టిని మరల్చడానికే ప్రతిపక్షం గొంతు నొక్కుతున్నారన్నారు. ఎన్ని అక్రమ కేసులు బనాయించినా చివరికి న్యాయమే గెలుస్తుందని, ఎంపీకి బెయిల్ రావడం ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదన్నారు. అలాగే అక్రమ లిక్కర్ కేసులో ఎంపీ కడిగిన ముత్యంలా బయటపడతారన్నారు.

## మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి



ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలని నిరసన తెలుపుతున్న దృశ్యం

**పీలేరు సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :**

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరే కిస్తూ మంగళవారం నిర్వహించనున్న రాయిచోటిలో నిరసన కార్యక్రమం ఎస్సీ సెల్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు కమలాకర్ అధ్యక్షతన జరిగింది మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ. 8,500 కోట్లతో 17 మెడికల్ కాలేజీలు ప్రారంభించి కొన్నింటిని పూర్తి చేసిందని, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. పేద విద్యార్థులకు వైద్య విద్య చేరువ కావాలని మాజీ సీఎం వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి కాలేజీ నిర్మాణాలు ప్రారంభిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి హరి , వైఎస్ఆర్ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు మలతోటి నరేష్ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శి శామ్యూల్ , నియోజకవర్గ కార్యదర్శి మేస్త్రి రామకృష్ణ , కలికిరి మండలం ఎస్సీ సెల్ అధ్యక్షులు సహదేవ పాల్గొన్నారు.

## నేడు పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

**దువ్వూరు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో 7203 మందికి వృద్ధాప్య, వికలాంగులు, వితంతు పింఛన్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో సుబ్బారెడ్డి తెలిపారు. 15 గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న 136 మంది సిబ్బందిని పింఛన్ల పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే 7203 మందికి 3కోట్ల 6లక్షల 3వేల రూపాయలు ఇప్పటికే సిబ్బందికి అందజేసినట్లు తెలిపారు. బుధవారం ఉదయం 7 గంటలకు గ్రామ సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తారని తెలిపారు.

## దుర్గాదేవి అలంకరణలో చౌడేశ్వరిదేవి.

**కేవీపల్లె , సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:**



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చీనేపలెల్లో వెలసిన శ్రీ రామలింగ చౌడేశ్వరి అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి దుర్గాదేవి అలంకరణ చేశారు. అమ్మవారికి దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## దుర్గాదేవి అలంకరణలో అమ్మవార్లు

**పీలేరు , సెప్టెంబర్ 30 తర్వాత వార్త:**



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక రౌద్రాల అంకాలమ్మ అమ్మవారు, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మంగళవారం స్థానిక మోడల్ కాలనీ లోని యల్లమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి దుర్గాదేవి అలంకరణ, పూజలు నిర్వహించారు. మూడు ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఎంపీని కలసిన వైఎస్సార్సీపీ నాయకులు



ఎంపీని కలసిన వైఎస్సార్సీపీ నాయకులు

**పీలేరు , సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:**

జైలు నుంచి బెయిల్పై వచ్చిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిని పీలేరుకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్సీపీ రాష్ట్ర మహిళావిభాగం ప్రధాన కార్యదర్శి మహిత, టెలీకాం బోర్డు మెంబరు ఆనంద్. నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు లక్ష్మి రామకృష్ణ, యశ్వంత్ హైదరాబాద్లో ఎంపీని కలిశారు.

## శ్రీ అగస్త్యేశ్వరాలయంలో మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి



**ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:**

దసరా ఉత్సవాల సందర్భంగా సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణ నడిబొడ్డున ఉన్న శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవాలయంలో ఎనిమిదవ రోజు మహిషాసుర మర్దినీ దేవిని కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి వారి కుటుంబ సభ్యులు, శివాలయం మాజీ చైర్మన్ కొత్తమిద్దే రఘురామి రెడ్డి కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు.

## జూదరులు అరెస్టు, కేసు నమోదు.

**చిట్వేలి, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:**



స్థానిక తుమ్మకొండ గ్రామంలో మంగతాయి జూదం నిర్వహిస్తున్న ఏడు మందిని మంగళవారం అరెస్టు చేసి,కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై నవీన్ బాబు తెలిపారు. తమకు రాబడిన సమాచారంతో తుమ్మకొండకు దక్షి ణం చీకి చెట్లలో మంగతాయి నిర్వహిస్తున్న ఏడు మందిని తమ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 18600 నగదు, ఆరు చరవాణిలు,మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని,కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

## ఎస్పీని కలసిన టీడీపీ ఇంచార్జి బిటెక్ రవి

**పులివెందుల , సెప్టెంబరు 30, ప్రభాత వార్త:**



కడప జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నచికేత్ విశ్వనాథ్ నీ కడప జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి ,బిటెక్ సోదరుడు తుంగభద్ర ప్రోజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి లు మర్యాదపూర్వకంగా కలిసి బుకే అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు ఎస్పీతో మాట్లాడుతూ జిల్లా శాంతి భద్రతలు, చట్ట సువ్యవస్థ మరింత బలపడాలని కోరుతూ, ప్రజల భద్రతా పరిరక్షణలో ఎస్పీ విజయవంతం కావాలన్న ఆకాంక్ష వ్యక్తం చేశారు.ప్రజల సంక్షేమం అభివృద్ధి శాంతి భద్రతల పరిరక్షణ పట్ల తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

## శక్తి స్వరూపిణి దుర్గాదేవి.. నమోస్తుతే.





**చిట్వేలి,సెప్టెంబర్ 30,ప్రభాతవార్త:**

శరన్నవరాత్రి ఉత్సవాలు, తొమ్మిదవ రోజున మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా శ్రీ భద్రకాళి అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో, శ్రీ వాసవి మాత మహిషాసుర మర్దిని గా భక్తులకు అభయమిచ్చారు. దుర్గముడనే రాక్షసుడిని ఈ అష్టమి రోజున సంహరించడంతో దుర్గాష్టమిగా పిలుస్తారని, ఈ రూపాన్ని దర్శించి, అమ్మవారిని భక్తితో కొలవడం వల్ల దుర్గతులను,శత్రుబాదులను తొలగించి విజయాలు చేకూరుతాయని అర్చకులు తెలపారు. శ్రీ శ్యామలాంబ అమ్మవారికి అర్చకులు ప్రత్యేక అలంకారం, విశేష పూజలు నిర్వహించారు. నిమ్మకాయలు, వడమాలలు సమర్పించారు. కుంకుమార్చనను చేపట్టారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలి

### ఎస్పీ ని కోరిన ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

**పులివెందుల, సెప్టెంబరు 30, ప్రభాత వార్త:**



అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌ను కోరారు. మంగళవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీని జిల్లా ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని స్థానిక సమస్యలు, అసాంఘిక కార్యకలాపాలు వంటి అంశాలపై ఎస్పీ తో చర్చించారు.

## మహిషాసుర ,మోహిని అవతారంలో అమ్మవారు నిజ దర్శనం





**పులివెందుల సెప్టెంబరు 30 ప్రభాత వార్త:**

దసరా పర్వదిన సందర్భంగా తొమ్మిదవ రోజు అమ్మవారు వివిధ రూపాలలో భక్తులకు నిజ దర్శనమిచ్చారు. పులివెందుల పట్టణంలోని శ్రీ వాసవికన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు మరియు అంకాలమ్మ దేవస్థానం నందు అమ్మవారు మహిషాసుర అవతారంలో శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పురోహితులు ఆయా దేవస్థానం నందు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించు కోవడానికి తరలి రావడంతో దేవస్థానాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారి శాల దేవస్థానంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు కే. శ్రీనివాసులు ,వాసవి క్లబ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్, మహిళా మండలి మరియు వనిత క్లబ్ అధ్యక్షురాలు మేడ సుబ్బరత్నాలు తదితర ఆర్యవైశ్య సంఘం సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలను కల్పించారు.

## శ్రీ ఆది చెన్నకేశవ స్వామి వారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



**బద్వేల్ అర్బన్ సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :**

బద్వేల్ మున్సిపాలిటీ పరిధి చెన్నంపల్లిలో వెలిసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ఆది చెన్నకేశవ స్వామి దేవాలయంలో దసరా ఉత్సవాలను ఆలయ కమిటీ చైర్మన్ పంగా చెన్న కృష్ణారెడ్డి మరియు పలువురు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది, మంగళవారం సాయంత్రం దసరా ఉత్సవాలలో భాగంగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆది చెన్నకేశవ స్వామివారిని దర్శించుకోవడం జరిగింది. వారికి ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పంగా చెన్న కృష్ణారెడ్డి పలువురు కమిటీ సభ్యులు సాధర్వంగా ఆహ్వానం పలికి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సత్కరించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు, అలాగే స్వామివారిని దర్శించుకున్న మున్సిపల్ కమిషనర్ వాకమళ్ళ వెంకట నరసింహారెడ్డి, పెద్దిరెడ్డి అమర్నాథ్ రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి శివయ్యతో పాటు పలువురికి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలను అందజేశారు,ఈ కార్యక్రమంలో పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## చంద్రబాబుకు కృతజ్ఞతలు హర్షం

**వేంపల్లి:సెప్టెంబర్ 30:(ప్రభాత వార్త)**



రాష్ట్రం లోని దేవాలయాల పాలక మండలి సభ్యులు గా బ్రాహ్మణులు కు అవకాశం కల్పిస్తామని ఎన్నికల హామీలలో చెప్పి నేడు అమలు చేయడం పట్ల బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ఆర్గనైసింగ్ సెక్రటరీ పీ వి ఎస్ వి ప్రసాదరావు ఒక ప్రకటన లో హర్షం వెలిబుచ్చుతూ చంద్రబాబు కు కృతజ్ఞతలు తెలియచేసారు. వేంపల్లి లోని శ్రీ వృషభ చలేశ్వర స్వామి దేవస్థాన పాలక మండలి లో బ్రాహ్మణ కేటగిరీ కింద వెలవలి మారుతీ ప్రసన్న కు సభ్యత్వం కల్పించి నేడు ప్రమాణ స్వీకారం చేయడం హర్షనీయమని అన్నారు. ఇటీవల ప్రకటించిన అన్ని దేవస్థాన పాలక మండలిలో రాష్ట్ర వ్యాప్తంగా గా బ్రాహ్మణులు కు కల్పించడం శుభపరిణామం అన్నారు. గతం లో దేవస్థాన పూజారి ఒక్కడే ఎక్స ఆఫీసియో మెంబెర్ గా ఉండేవాడని నేడు పూజారి తో పాటు మరిఒకరికి అవకాశం వచ్చిందని అన్నారు.. ఎన్నికల హామీ లో మరిఒకటి అయిన విద్యుత్ ఛార్జిల తగ్గింపు లో భాగంగా నవంబర్ నుండి యూనిట్ కు 13పైసలు తగ్గింపు చేస్తున్నట్లు ప్రకటించడం హర్షనీయమని పేద బడుగు వర్గాలకు ఇది ఎంతో ఉపశయనం కలిగిస్తుందని అన్నారు. ఎన్నికలు లో ఇచ్చిన హామీలు అన్ని ఏ ప్రభుత్వం ఒకేసారి అమలు చేయలేదనే సంగతి తెలిసిన కొంతమంది నాయకులు తమ రాజకీయాల కోసం విమర్శలు చేస్తున్నారని ఇది సహేతుకం కాదని అన్నారు.ఏది ఏమైనా ఎన్నికల హామీలు ఓ కొక్కటి అమలు చేస్తుండడం హర్షనీయమని పేర్కొన్నారు.

## కోర్టు ఆదేశాల అమలులో ఉద్దేశ్యపూర్వకంగా జాప్యం చేయకపోతే కోర్టు ధిక్కారం కానేరదు

### (సుప్రీం కోర్టు తీర్పు)

**బద్వేలు లీగల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :**

ఉద్దేశ్యపూర్వకంగా లేదా దురుద్దేశం లేకుండా న్యాయస్థాన ఆదేశాలను పాటించడంలో జాప్యం జరిగితే కోర్టు ధిక్కారం క్రిందికి రాదని చెబుతూ సుప్రీం కోర్టు ఓ తీర్పును వెలువరించింది. వివరాలలోకి వెళితే... మాజీ బ్యాంకు మేనేజరుకు 3 నెలల లోపు బకాయి మొత్తాన్ని చెల్లించాలని బ్యాంకును ఆదేశిస్తూ కోర్టు జారీ చేసిన ఆదేశాన్ని పాటించనందుకు వ్యతిరేకంగా ఆయన దాఖలు చేసిన కోర్టు ధిక్కార పిటీషన్ పై భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్, న్యాయమూర్తి ఎ.జి.మసీహ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. 3 నెలల కాల పరిమితి లోపు చెల్లింపు జరపడంలో విఫలమైనట్లు బ్యాంకు అంగీకరించింది. కోర్టు ఆదేశాల అమలులో జాప్యం ఉద్దేశ్యపూర్వకంగా జరగలేదని తమ బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంకులో విలీనమైన తరువాత పాలనా పరమైన అడ్డంకులు ఎదురయ్యాయని వాదించింది. ఈ ఉల్లంఘన ఉద్దేశ్యపూర్వకంగానో లేక దురుద్దేశ్యంతోనో జరిగింది కాదని గమనించిన ధర్మాసనం ప్రస్తుత కేసులో కోర్టు ధిక్కార నిబంధన అమలును తిరస్కరిస్తూ ఈ కోర్టు అనుమతించిన సమయంలో బ్యాంకు చెల్లింపును అమలు చేయనప్పటికీ తీర్పు అమలులో జాప్యం ఉద్దేశ్యపూర్వకంగా లేదా మోసపూరితంగా జరిగిందని రికార్డుల ప్రకారం నిరూపించబడలేదని వేరే బ్యాంకుతో విలీనం వల్ల అదే విధంగా 3 దశాబ్దాల నాటి రికార్డులను వెతకడం వంటి పాలనా పరమైన అడ్డంకులు ఎదురయ్యాయని బ్యాంకు వివరణ ఇచ్చింది. ఈ కోర్టు ఆదేశాలను పాటించడంలో అలసత్వాన్ని సదరు పరిస్థితులు రుజువు చేయడం లేదని కేవలం ఆలస్యం కారణంగా ధిక్కార అభియోగాన్ని కొనసాగించలేము అని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. కోర్టు ధిక్కార వ్యవహారంలో క్రొత్త క్లెయింలు లేవదీయడానికి ఇతర ఉపశమనాలు కోరడానికి వీల్లేదని కోర్టు సుస్పష్టం చేసింది. పెన్షన్ మంజూరుకు సంబంధించిన ధిక్కార పిటీషన్‌లో క్రొత్త అంశాన్ని ప్రస్తావించడంపై అప్పిలెంట్‌ను కోర్టు మందలించింది. ధిక్కార పిటీషన్ క్రొత్త వాదనలను లేవనెత్తడానికి లేదా ఇంతకు ముందు లేవనెత్తిన లేదా మంజూరు చేయని గణనీయమైన ఉపశమనాలను కోరడానికి ఒక వేదిక కాదు అని కోర్టు నొక్కి వక్కానించింది. సాధారణ న్యాయ విచారణ పరిధిలోకి వచ్చే అంశాలను తేల్చుకునేందుకు ధిక్కార పిటీషన్‌ను ఉపయోగించడం కుదరదని ఈ కోర్టు ఝరేశ్వర్ ప్రసాద్ పాల్ ఎదిరి తారక్‌నాథ్ గంగూలి (2002) కేసులో తీర్పు చెప్పింది. ఆ తీర్పును అనుసరించి ప్రస్తుత దశలో పెన్షన్‌కు సంబంధించిన అభ్యర్థనను స్వీకరించలేము అని కోర్టు సుస్పష్టం చేస్తూ కోర్టు తీర్పు అమలును కావాలని సాగదీయకపోతే కోర్టు ధిక్కారం క్రిందకు రాదని తే.19-8-2025 దీన ఈ తీర్పును వెలువరించింది. (ఎం.కె.జయప్రకాష్ లేట్ త్రూ లీగల్ హైర్స్ ఎదిరి మల్లిఖార్జునరావు అండ్ అదర్స్ కంటెంప్ట్ పిటీషన్స్ నెం.1002-1003/2023 ఇన్ సివిల్ అప్పీల్ నెం.6732-6733/2009)

## వాసవి మాత ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి



**బద్వేల్ అర్బన్ సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :**

దసరా శరన్నవరాత్ర మహోత్సవం పురస్కరించుకొని మంగళవారం బద్వేల్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాల కమిటీ అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు, గౌరవ అధ్యక్షులు కన్నమర్లపూటి ప్రసాద్, సెక్రటరీ ఉరిమి శ్రీనివాసులు మరియు పలువురు కమిటీ ఆహ్వానం మేరకు శ్రీ వాసవి మాత అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేల్ టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ రితేస్ రెడ్డి తోపాటు పలువురు నాయకులు వాసవి మాత అమ్మవారిని దర్శించుకున్నారు, వారికి ఆలయ కమిటీ సభ్యులు వాసవి మాత సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి పట్టు వస్త్రంతో సత్కరించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు, అనంతరం వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల కులదైవమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి దసరా ఉత్సవాలలో 11 రోజులు పాటు అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజలు చేపట్టడం సంతోషకరమన్నారు. పొద్దుటూరుకు దీటుగా బద్వేల్ పట్టణంలో దసర ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వాసవి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు, అనంతరం మహాలక్ష్మి దేవాలయం వీరభద్ర స్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ టిడిపి నేత రితేష్ రెడ్డి తో పాటు పలువురు నాయకులు స్వామి వారిని దర్శించుకున్నారు ఆయా కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించే అమ్మవారి ప్రసాదాలు అందజేశారు,



## రాష్ట్ర 3వ మహాసభలు జయప్రదం చేయండి

**వేంపల్లి:సెప్టెంబర్ 30:(ప్రభాత వార్త)**

మధ్యాహ్న భోజన కార్మికులు అవస్థలు తనకు తెలుసని వారికి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.పది వేల వేతనం అందించి ఆదుకుంటామని జగన్మోహన్‌రెడ్డి,చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వడం అధికారంలోకి వచ్చేసరికి ఇద్దరూ ఆ హామీని గాలికి వదిలేశారని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ బాదుల్లా ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ చాంద్ భాష లు ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర మూడవ మహాసభలు అక్టోబర్ 11, 12 తేదీల్లో విజయవాడలోని దాసరి భవన్ లో జయప్రదం చేయాలని మంగళవారం పాత మార్కెట్ లోని ఉర్దూ హైస్కూల్లో కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 86వేల మంది పేద మహిళా కార్మికులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్నారని ప్రభుత్వాలు మారుతున్నాయని పథకాల పేరు మారుస్తున్నారని అయినా కార్మికుల బతుకులు మారడం లేదని వారు విమర్శించారు.గత 10 సంవత్సరాలుగా ఒక రూపాయి కూడా వేతనం పెంచకుండా గత ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పేరుతో అనేక ఇబ్బందులకు గురి చేసిందని నెలకు అతి తక్కువ వేతనంతో ఈ కార్మికులు పనిచేస్తున్నారన్నారు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సెంట్రలైజ్ కిచెన్ పేరుతో ప్రైవేటీకరణ చేయడానికి కుట్ర పడిందని దీని వ్యతిరేకిస్తున్నామని కార్మికుల వేతనాలు పెంచి పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన ప్రభుత్వం కార్మికుల కడుపు కొట్టడం తగదన్నారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం వల్ల అనేక ఇబ్బందులు తలేత్తే అవకాశం ఉందని వారన్నారు.. తక్షణమే వీరికి కనీస వేతనం 10000 రూపాయలు ఇవ్వాలని వారి డిమాండ్ చేశారు. పెన్షన్ సౌకర్యం కల్పించాలని పనిచేసే చోట మౌలిక వసతులు కల్పించాలని వారి కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థిని విద్యార్థులు మెస్ చార్జీలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై రాష్ట్ర మహాసభల్లో భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని ప్రభుత్వాల అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసన పోరాటం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రియాజ్ గౌసియా మున్ని పాల్గొన్నారు.



## దుర్గామాతగా దర్శనమిచ్చిన కామాక్షమ్మ

పెనగలూరు సెప్టెంబరు 30 ప్రభాతవార్త



మండల కేంద్రమైన పురాతన శివాలయంలో గల కామాక్షమ్మ వారు దుర్గాష్టమి పర్వదినం సందర్భంగా మంగళవారం దుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఉభయదారులు కామాక్షమ్మను దుర్గామాతగా అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కలగజేశారు దేవాలయానికి విచ్చేసిన భక్తులకు ఉభయ దాతలు తీర్థప్రసాదాలు అందజేశారు.

## వాటర్ కూలర్ వితరణ



పెనగలూరు సెప్టెంబర్ 30 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బిజెపి జిల్లా కార్యదర్శి పనతల నరేష్ మంగళవారం వాటర్ కూలర్ వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులు ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు నరేష్ ఏర్పాటుచేసిన తాగునీటి శుద్ధి యంత్రం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు అలాగే నరేష్ ఆవుదార్యానికి ఆయన అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు కోనేటి రెడ్డి కృష్ణ, పీహెచ్సీ డాక్టర్ శ్రేయ ఎస్సై రవిప్రకాష్ రెడ్డి, జిల్లా సేవాపక్షోత్సవాల కన్వీనర్ ఆదినారాయణ, రాష్ట్ర ఎస్సీ మాజీ కార్యదర్శి ఈటమాపురం సుబ్రహ్మణ్యం, నాయకులు జనార్ధన్ రమేష్ శ్రీనివాసులు ఎస్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ నైపుణ్యాలకు పునాది ఇంటర్న్‌షిప్

సిద్ధవటం సెప్టెంబర్ 30 ప్రభాతవార్త



మండలం లోనిభాకరాపేట, 11వ పోలీసుపటాలము జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పీ ఎం శ్రీ పథకంలోని ఒకేషనల్ కోర్సుల్లో భాగంగా ఆటోమోటివ్ విభాగంలో ఒకేషనల్ టీచర్ షేక్ మోలాలి ఆధ్వర్యంలో ఇంటర్న్ షిప్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సమీర్ బాష తెలిపారు. మాధవరం పరిసర ప్రాంతాల్లో ఉన్న టు వీలర్ సర్వీస్ పాయింట్లకు విద్యార్థులను తీసుకెళ్లి ప్రాయోగిక అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల22 ప్రారంభోత్సవం చేశామని అక్టోబర్ 1 వరకు జరుగుతాయని తెలిపారు విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంలో భవిష్యత్తుకి అవసరమయ్యే నైపుణ్యాలను పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని హెచ్.ఎం. సమీర్ బాష తెలిపారు.

## కాలనీ మహిళలకు దుస్తుల పంపిణీ

పోరుమామిళ్ళ రూరల్ ,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:




మండల పరిధిలోని రామాయ్యపల్లె యానాది కాలనీలో 40 మంది మహిళలకు మంగళవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకుని కొత్త దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా కాలనీ వాసులకు దాతల సహకారంతో వీరికి అవసరమైన నిత్యావసరాలు, దుస్తులు, చెప్పులు, దుప్పట్లు, భోజనాలు, తినుబండారాలు, పిల్లలకు బ్యాగ్‌లు, నోటుపుస్తకాలు పంపిణీ చేసి వారిలో చైతన్యాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

## ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలి

ఎడ్యుకేషన్ సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :

జిల్లాలోని వివిద కేజీబీవీలలో పనిచేస్తూ 2025 మెగా డీఎస్సీ నందు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎన్నికైన ఉపాధ్యాయినిలను యుటిఎఫ్ కడప జిల్లా శాఖ అభినందించింది. మంగళవారం కడప యుటిఎఫ్ భవన్‌లో జరిగిన సమావేశంలో కేజీబీవీలలో పని చేస్తూ డీఎస్సీకి ఎంపికైన ఉపాధ్యాయినిలను ఉద్దేశించి యుటియఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ అకుంఠిత దీక్షతో ఒకవైపు విధులు నిర్వహిస్తూ మరోవైపు కఠోర శ్రమతో ఆంధ్ర సివిల్స్ డీఎస్సీ పరీక్షల్లో ప్రతిభను చాటి పాఠశాల సహాయకులుగా ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. జిల్లాలోని వివిధ కస్తూర్బా పాఠశాలలు చాపాడు నుండి ప్రసన్నలక్ష్మి, కోడూరు నుండి మమోల, పెద్దముడియం నుండి మేరమ్మ, ఓబులమ్మ, గంగా శిరీష, మైదుకూరు నుండి హరిత, జమ్మలమడుగు నుండి కళావతి, గీత, వేముల నుండి నాగమల్లేశ్వరమ్మ, వల్లూరు నుండి పున్నమ్మ డీఎస్సీలో మెరిట్ సాధించారన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారు హక్కులతో పాటు విధుల పట్ల అంకిత భావాన్ని కలిగి ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషిచేస్తూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎడి దేవదత్తం తదితరులు పాల్గొన్నారు.



## సమిష్టి కృషితో ఆర్టీసీకి ఆదాయం

కె.వి పల్లి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:



తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సమిష్టి కృషితో ఆర్టీసీకి ఆదాయం వచ్చినట్లు డీఎం ఎస్.ఎం.డి. రోషన్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శని, ఆదివారల్లో పీలేరు డిపో పరిధిలో 99 బస్సు సర్వీసులు 80 వేల కిలోమీటర్లు తిప్పి రూ. 47.54 లక్షలు ఆదాయం సాధించినట్లు తెలిపారు. ఈపీకే 55. ఓఆర్ 107 సాధించి అదనంగా రూ. 7.50 లక్షలు ఆదాయం సాధించినట్లు చెప్పారు. ఆదాయం రావడానికి కృషి చేసిన ఆర్టీసీ సిబ్బందిని అభినందించారు. ఈ సమావేశంలో బస్టేషన్ మేనేజర్ బాబునాయక్ పాల్గొన్నారు.

## చెరువులో గుర్తు తెలియని మృతదేహం

పీలేరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:

చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలోని కాకులారంపల్లె పంచాయతీలో కాకులారంపల్లె పంచాయతీ చింతకొమ్మచెరువులో గుర్తు తెలియని యువకుడి వివరాలిలావున్నాయి. మృతదేహం తేలాడుతూ ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు ఎవరైంది ఎలాంటి ఆధారాలు లేవని సీఐ యుగంధర్ తెలిపారు. మృతుని కుడి చేతిపై అమ్మ అని, మణికట్టుపై ఎస్బీఆర్ అనే అక్షరాలతో పచ్చబొట్టు ఉందని చెప్పారు. మృతుడు ఎవరైంది తెలిస్తే 9440796944. 9440796745 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## రైతులకు సౌకర్యార్థంగా నూతన మార్కెట్‌యార్డు

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రైతులకు సౌకర్యార్థంగా నూతన మార్కెట్‌యార్డు నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం నూతన మార్కెట్‌యార్డు నిర్మాణానికి రెవెన్యూ అధికారులతో కలసి రూరల్ మండలంలోని శానిటోరియం వద్ద 52 ఎకరాల విస్తీర్ణం గల భూమిని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య పెరుగుతుండడం వల్ల నీరుగట్టువారిపల్లెలో ఉన్న మార్కెట్‌యార్డుకు రైతులు పండించిన టమోటాలను రవాణా చేయాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మార్కెట్‌యార్డుకు సంబంధించి అసెంబ్లీలో కూడా తాను చర్చించడం జరిగిందన్నారు. 50 ఎకరాలు స్థలం కేటాయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో భాగంగానే రెవెన్యూ అధికారులతో కలసి భూములను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సర్వే చేయించి రైతులకు సౌకర్యార్థంగా మార్కెట్‌యార్డు నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. పట్టణం విస్తరిస్తుండడం వల్లే బయట ప్రాంతంలోని మెడికల్ కళాశాల సమీపంలో మార్కెట్‌యార్డు నిర్మాణానికి స్థలపరిశీలన చేయడం జరగిందన్నారు.

## మేధో సంపత్తిని పెంపుందించుకోవాలి

రిటైర్డు గ్రూప్ కెప్టన్ పరందామ్‌గౌడ్

మదనపల్లె, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :



విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

విద్యార్థులు మేధో సంపత్తిని పెంపొందించుకోవాలని రిటైర్డు గ్రూప్ కెప్టన్ ఇండియన్ ఏయిర్‌ఫోర్స్ డాక్టర్ కె.పరందామ్‌గౌడ్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని సంఘం పంక్షన్‌హాలు నందు పివికే ఫౌండేషన్ ఫౌండర్ ఛైర్మెన్ డాక్టర్ మర్రిపాటి రమేష్ ఆధ్వర్యంలో 2025లో ఉత్తమ ప్రతిభ కనపరచిన కురబ విద్యార్థులు, ఉద్యోగులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన ప్రిన్సిపాల్ జివి.రమణ, డాక్టర్ చెన్నకేశవులు, రిటైర్డు లెక్చరర్ ఆదినారాయణ, దండు రామాంజులు, మల్లికార్జున, ఎస్ఐ చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో కురబ విద్యార్థులు అత్యున్నత ప్రమాణాలతో విద్యాభ్యాసం చేసి ఉన్నత శిఖరాలను అదిరోహించాలన్నారు. సామాజిక వర్గానికి సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రతిభ కనపరచిన 150మందికి ప్రతిభా పురస్కారాలు అందించి శాలువ, మోమెంటోలతో సత్కరించారు. భవిష్యత్తులో కూడా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యాపరంగా అవసరమైన అన్ని సలహాలు ఇస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవడానికి సహాయ సహకారాలు అందిస్తానని డాక్టర్ మర్రిపాటి రమేష్ తెలిపారు. ఈకార్యక్రమంలో బాలకర్ణ, సాంబశివ, ప్రభ, కురబసంఘం నాయకులు, కుల బాంధువులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని వాయిదా వేస్తున్న వైసిపి కౌన్సిల్

టిడిపి కౌన్సిలర్ తులసీ రామక్రిష్ణ

మదనపల్లె, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :



పట్టణంలో జరగాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి కౌన్సిల్ మీట్‌లో అజెండా ఆమోదించకుండా వైసిపి కౌన్సిల్ వాయిదా వేయడం ప్రజలను మోసగించడమేనని తెలుగుదేశం పార్టీకి చెందిన 20వ వార్డు కౌన్సిలర్ తులసీ రామక్రిష్ణ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసిపి పార్టీకి చెందిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజా కౌన్సిల్‌లో సంపూర్ణ మద్దతు ఉందన్న నెపంతో పట్టణాభివృద్ధిని అడ్డుకొంటోందన్నారు. కేవలం టి, స్నాక్స్ కోసమే కౌన్సిల్ సమావేశమా అంటూ ప్రశ్నించారు. అజెండాపైన ఏమాత్రం చర్చించకుండా అధికారులపైన ఆరోపణలు చేయడం సమంజసమా అన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరించడంలో వైసిపి కౌన్సిల్ పూర్తిగా విఫలం చెందిందన్నారు. ప్రజల చేత ఎన్నుకొని ఉంటే ప్రజా సమస్యలు తెలిసి ఉండేవిని అడ్డదారిలో ఎన్నికైన వారికి సమస్యలు ఎలా తెలుస్తాయన్నారు. అభివృద్ధి, నిధులు వినియోగించుకోలేని అసమర్థత కౌన్సిల్ రాజీనామా చేసి ఇంటిలో కూర్చోవాలని ఎద్దేవా చేశారు. నాలుగన్నరేళ్ళలో పట్టణంలోని రోడ్లన్నీ గుంతల మయంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా శానిటేషన్ మరింత అధ్వాన్నంగా ఉందన్నారు. 14, 15వ ఫైనాన్స్ నిధులు కూడా సక్రమంగా వినియోగించుకోలేని అసమర్థత వైకాపా కౌన్సిల్ అన్నారు.

## బుద్దినికొండలో పూజలకు హైకోర్టు అనుమతి

మదనపల్లె, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :

పట్టణ సమీపంలోని బుద్దినికొండపై విజయదశమి సందర్భంగా పూజలు చేసుకునేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చినట్లు బౌద్ద ఉపసకుడు పిటిఎం శివప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. విజయదశమి సందర్భంగా గురువారం జరిగే అశోక విజయదశమి, అంబేద్కర్ ధమ్మదీక్షా దినం వేడుకలకు విచ్చేయాలని ఆయన కోరారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుద్దిని విగ్రహం ధ్వంసం చేయడంపై కేసు నమోదు చేసి దర్యాప్తులో ఉన్న భాగంగా బుద్దిని కొండపైకి ఎవరూ వెళ్ళకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆంక్షలు విధించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో పూజలు చేసుకునేందుకు హైకోర్టు అనుమతించిందని ఆయన తెలిపారు. పూజలకు పోలీస్, రెవెన్యూ అధికారులు సహకరించాలని ఆయన కోరారు.

## కార్యకర్తలకు అండగా నిలిచేందుకే డిజిటల్ బుక్

పీలేరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:

వైసీపీ కార్యకర్తలకు అండగా నిలిచేందుకే వైయస్ జగన్మోహన్ రెడ్డి డిజిటల్ బుక్‌ను ఏర్పాటు చేశారని వైసీపీ పీఏసీ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానికవైసీపీ.కార్యాలయంలో ఆయన డిజిటల్ బుక్ పోస్టర్లతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పాలనలో రెడ్ బుక్ పేరిట వైసీపీ నాయకులు కార్యకర్తలపై తప్పుడు కేసులు, అరాచకాలు, వేధింపులు ఎక్కువైపోయాయని, వైసీపీ నాయకులు, కార్యకర్తలను వేధించడమే అజెండాగా కూటమి పాలన సాగుతోంది తప్ప ప్రజల సంక్షేమాన్ని, గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేసారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం, పాలకుల ద్వారా వేధింపులు, అన్యాయాలకు గురైన వారు క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ బుక్ లో తమకు జరిగిన అన్యాయాన్ని నమోదు చేయాలని, దీనిపై ప్రభుత్వం వచ్చిన తర్వాత వేధించిన వారిపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నీళ్ల భాస్కర్,పులి శివారెడ్డి, అబ్దుల్ కలీమ్, కువైట్ ఇబ్రహీం, చంద్ర, విశ్వనాథ్, చలపతి, సురేష్ కుమార్ రెడ్డి, సతీష్, యూసఫ్,అమిన్ పీర్ తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

## తెలంగాణ గవర్నర్ చే పిహెచ్డీ పట్టా

వేంపల్లె :సెప్టెంబర్:30:(ప్రభాత వార్త)



స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న చరిత్ర అధ్యాపకుడు డా.బాలకొండ గంగాధర్ కు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ చే పిహెచ్డీ పెట్టాను అందజేశారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్, వరాహగిరి వెంకటగిరి, నీలం సంజీవరెడ్డి లపై విమర్శ నాత్మక విశ్లేషణ అంశాలపై ప్రొఫెసర్ సుధారాణి పర్యవేక్షణలో ఆయన పిహెచ్డీ పూర్తి చేశారు. గడిచిన 30 ఏళ్ల ఆయన కడప సుబ్బిరెడ్డి డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాల, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకునిగా విశిష్టమైన సేవలందించారు. డా.బాలకొండ గంగాధర్ ఇప్పటి వరకు 10కీ పైగా గ్రంధాలు, 40 పరిశోధన పత్రాలు దేశీయ, అంతర్జాతీయ సదస్సులో సమర్పించారు. 2014లో ఉత్తమ టీచర్ అవార్డు, 2015లో గ్లోబల్ రోల్ మోడల్ అవార్డు, అలాగే ఏపి హయ్యర్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు, 2024లో ఏపి టూరిజం ఎక్సలెన్స్ ఇన్ రైటింగ్ అవార్డు లను అందుకున్నారు. వీరికి చరిత్ర శాఖలో డాక్టర్ పట్టా రావడం పట్ల అధ్యాపకులు, మిత్రబృందం, ప్రముఖులు, సామాజిక వేత్తలు అభినందం తెలియజేశారు.

## బిజెపి కడప జిల్లా కార్యదర్శిగా కంబగిరి

ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:



బిజెపి కడపజిల్లా కార్యదర్శిగా ప్రొద్దుటూరు మండలం తల్లమాపురం గ్రామానికి చెందిన కొర్రపాటి కంబగిరిని నియమించినట్లు కడప జిల్లా బిజెపి అధ్యక్షుడు జంగింటి వెంకటసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ జనతా పార్టీలో చాలా కాలంగా వివిధ పదవులు నిర్వర్తించి, పార్టీకి అంకితభావంగా పనిచేసిన కారణంగా కంబగిరి నియమించినట్లు ఆయన తెలిపారు. ఇక మీద కూడా పార్టీకి అంకితభావంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా కోశాధికారి సివి జయలక్ష్మి ద్వారా మంగళవారం ఆయన పదవి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు కంబగిరిని అభినందించారు.

## మిదున్ రెడ్డికి బెయిల్ సుండుపల్లెలో సంబరాలు

సుండుపల్లె, సెప్టెంబర్ 30,ప్రభాతవార్త:



అక్రమ కేసులో రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరైన సందర్భంగా మండల కన్వీనర్ రామస్వామి రెడ్డి ఆధ్వర్యంలో మండల వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు మంగళవారం స్థానిక వైఎస్ఆర్సిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం మిథున్ రెడ్డిని 72 రోజులపాటు నిర్బంధించి బెయిల్ రాకుండా కుట్రలు, కుతంత్రాలు చేసిందన్నారు. ఇబ్బందులకు గురి చేసినా చివరకు న్యాయమే గెలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఇస్మాయిల్, రాష్ట్ర బూత్ కమిటీల ప్రధాన కార్యదర్శి రెహమాన్ ఖాన్, ఎస్టి జిల్లా అధ్యక్షులు చంద్ర నాయక్, మండల మైనార్టీ నాయకులు రహీం భాషా,మధుసూదన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, ఖలీమ్ భాష, బాబురెడ్డి, శివారెడ్డి, వెంకట్రామిరెడ్డి,చింటూ రెడ్డి, రాజశేఖర్ నాయక్,మోహన్, అఫ్రిద్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులో బంగారు నగలు చోరీ

ముద్దనూరు. సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:

మండల పరిధిలోని దేనేపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీప్రసన్న తమ కుటుంబ సభ్యులతో కలిసి ఎర్రగుంట్ల మండలం పోట్ల దుర్తి గ్రామానికి వెళుతుండగా ప్రొద్దుటూరు ఆర్టీసీ బస్సులో గుర్తు తెలియని వ్యక్తులు తన పర్సును అందులో ఉన్న బంగారు నగలను దొంగలించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలు సమాచారం మేరకు తమ కుటుంబ సభ్యులతో కలిసి సొంత గ్రామం నుంచి ద్విచక్ర వాహనం మీద ముద్దనూరు పట్టణంలోని పాత బస్టాండు ఆవరణకుకు వచ్చి తమ పిల్లలకి కావలసిన వస్తువులను తీసుకున్నపుడు పర్సులోని నగలు ఉండగా పులివెందుల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రొద్దుటూరుకు వెళుతున్న బస్సులో ప్రయాణించేందుకు బస్సు ఎక్కగా ముద్దనూరు పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలికి చేరుకున్న సమయంలో బస్సు కండక్టర్ టికెట్టు అడగగా తన వెంబడి తెచ్చుకున్న కట్టెల బ్యాగులో ఉన్న ఆధార్ కార్డు కోసం పర్సును వెతకగా పర్సు కనిపించలేదు అందులో ఉన్న బంగారు నగలు నల్లపూసల దండ,హారం, సుమారు 45 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించకపోవుసరికి, బస్సు అంతా వెతికిన ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు గమనించి స్థానిక పోలీస్ స్టేషన్లో భార్య, భర్త ఇరువురు కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై సిఐ దస్తగిరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## పిల్లల్లో శాస్త్రీయత పెంచడమే చెకుముకి లక్ష్యం

ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 30 ప్రభాత వార్త:




పిల్లల్లో శాస్త్రీయత పెంచడమే చెకుముకి లక్ష్యమని చెకుముకి ఎడిటోరియల్ బోర్డ్ మెంబర్ యుగంధర్ అన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర స్థాయి చెకుముకి ప్రశ్నాపత్రాల వర్క్ షాప్ రెండు రోజులు స్థానిక ప్రొద్దుటూరు జేవివి ఆఫీసు నందు నిర్వహించారు. ఈ వర్క్ షాప్ కు 5 జిల్లాల నుంచి రిసోర్స్ పర్సన్స్ వచ్చారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ చెకుముకి సంబరాల ద్వారా విద్యార్థులలో సృజనాత్మకత పెరుగుతుందని, ఆలోచనా విధానంలో తార్కికత మెరుగౌతుందన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి శివరామ్ మాట్లాడుతూ గత 35 సంవత్సరాల నుండి 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వివిధ స్థాయిలలో వారి టాలెంట్ ను వెలికితీసే ప్రయత్నం చెకుముకి ద్వారా జరుగుతోందని తెలిపారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తవ్వా సురేష్ మాట్లాడుతూ ఈ సంబ రాలలో సైంటిస్టులతో విద్యార్థుల ముఖాముఖి చర్చల ద్వారా వారిలో సైన్స్ పట్ల అభిరుచి పెరుగుతుందని, ప్రయోగాల ద్వారా ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించడం అలవడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమములో రాష్ట్ర నాయకులు బాల చైతన్య , మహేంద్ర రెడ్డి, ప్రకాశ్ రెడ్డి , జిలానీ బాషా, మాదాల రాము, సునీత, జిల్లా గౌరవ సలహాదారులు గోపీనాథ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి రాజేష్, జిల్లా కమిటీ సభ్యులు సుబ్బయ్య, జెవివి నాయకులు తిరుమల కొండు, అల్లా బకష్, మురళీ గుప్త, శివనాథ్ పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం

కలసపాడు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:



మండలంలోని దిగువ తంబళ్ల పల్లె గ్రామానికి చెందిన ఈశా అంజలి (26) తప్పిపోయిందని భర్త శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని కలసపాడు ఎస్సై ఎల్ తిమోతి తెలిపారు. వివరాల్లోకి వెళితే ఈనెల 22వ తేదీన పోరుమామిళ్ళకు హోటల్లో పని చేసుకునే దానికి వెళ్లిందని ఇంటికి ఇప్పటివరకు తిరిగి రాలేదని చుట్టుపక్కల బంధువులు ఇళ్లలో విచారించామని ఎక్కడ ఆచూకీ తెలియకపోవడంతో పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేశామని అదృశ్యమైన మహిళ భర్త తెలిపారు. ఎవరైనా ఆచూకీ తెలిస్తే ఫోన్ నెం. 9121100632 తెలపాలని ఎస్సై ఎల్. తిమోతి అన్నారు.

## రితీశ్ రెడ్డి, విజయమ్మలకు సత్కారం

పోరుమామిళ్ల రూరల్, సెప్టెంబర్ 30ప్రభాతవార్త:

బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గా నియమితులైన బసిరెడ్డి రవీంద్రారెడ్డి టిడిపి ఇన్చార్జ్ రితీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మలను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజవర్గంలోని రైతులకు అందుబాటులో ఉంటూ వారి అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆయనకు సూచించారు. తమపై నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానన్నారు. గోడౌన్ పెండింగ్ పనులపై సమీక్షిస్తామన్నారు.



## కురవలు రాజకీయ ఎదుగుదలకు సహకరించాలి

సుండుపల్లె, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:



రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను కలిసినట్లు కురవ సంఘం అన్నమయ్య జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మంగిరి సురేశ్ తెలిపారు. బీసీల సంక్షేమానికి కృషి చేయాలని ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించేలా చూడాలని కోరామన్నారు. జిల్లాలోని కురవల రాజకీయ ఎదుగుదలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని కోరినట్లు తెలిపారు. టీడీపీ పార్టీలో యువతకు ప్రత్యేక స్థానం కల్పిసున్నట్లు, కురవల అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మైదుకూరు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:



మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రొద్దుటూరు ఆయన స్వగృహంలో నియోజకవర్గ ప్రజలకు సీ ఎం సహాయక నిధి కింద 29,45,000 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నియోజవకవర్గాని కి చెందిన 22 బాధిత కుటుంబాలకు ఆఫీస్ నందు అందజేశారు. ఆర్థిక సహాయం అందించిన కూటమి ప్రభుత్వానికి ఎమ్మెల్యేకు బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రభుత్వ హాస్పిటల్‌లో ఎక్స్ రే మిషన్

మైదుకూరు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:



ప్రభుత్వ ఆసుపత్రి నందు ప్రజల సౌకర్యార్థం కొత్త ఎక్స్ రే మిషను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ యాపరాల చిన్న సమర్థుడని భావించే ఈ పదవి ఇవ్వడం జరిగింది. ఆస్పత్రి మెయింటెన్స్ బాగుందని, మన ప్రభుత్వ ఆసుపత్రి, ప్రైవేట్ హాస్పిటల్ కన్నా చాలా బాగుందన్నారు. అంతేకాకుండా తన మిత్రుడు పత్తి సుబ్బారావు సహకారంతో నాలుగు ఐరన్ కుర్చీలను ఆసుపత్రిలో వేయించడం జరిగింది. త్వరలో డయాలసిస్ సెంటర్, పోస్టుమార్టం, అవుట్ పోస్ట్ మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి మంజూరు కానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ యాపరాల చిన్న, పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు ,మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, ధనపాల జగన్, కాలువ గురప్ప, కోన సుబ్బారావు, బండి అమర్నాథ్ ,తుపాకుల రమణ, డాక్టర్ల జోష్న రెడ్డి, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహాషాసురమర్దిని అలంకారంలో కన్యకా పరమేశ్వరి





బ్రహ్మంగారిమఠం సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు ఆహ్వాన మేరకు ఎమ్మెల్సీ గోవిందరెడ్డికి ఘన స్వాగతం పలికి శ్రీ కన్యకాపరమేశ్వరి శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను తిలకించి అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది.వీరి వెంట కరెంటు రమణారెడ్డి, అమగంపల్లి ప్రభాకర్‌రెడ్డి, పాల్గొన్నారు. శ్రీ మహాషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు, మంగళవారం ఉభయదాతాలైన యాదాల్ల సురేంద్ర ధర్మపత్ని సరస్వతి, మల్లేముల సుబ్బారావు ధర్మపత్ని లక్ష్మిదేవి ముచ్చర్ల సత్య నారాయణ ధర్మపత్ని పద్మజ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు బన్నూరు కృష్ణమూర్తి, యువజన సంఘం అధ్యక్షుడు మాదాళ్ళ వెంకట సుబ్బయ్య,మాజీ కమిటీ సభ్యులు ముచ్చర్ల శేషయ్య, కార్యదర్శి సుం కు సురేష్ బాబు,పబ్బతి నాగేశ్వరరావు దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు సుంకు సురేష్ బాబు యాదాళ్ళ వెంకటసుబ్బయ్య, కోశాధికారి దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు, మాకం సుధాకర్, దుగ్గిశెట్టి గురవయ్య, ఆర్య వైశ్య మహిళలు,తదితరులు ఉన్నారు.

## ప్రజాదరణ చూసి ఓర్వలేకే ఎంపీపై అక్రమ కేసులు

కడప కార్పొరేషన్ సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:



ప్రజా సమస్యల కోసం ఎంపి మిథున్ రెడ్డి కృషి చేస్తున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి, గల్ఫ్ కో కన్వీనర్ గోవింద నాగరాజు అన్నారు. ప్రజాసేవయే పరమాదిగా నిత్యం పనిచేస్తున్న ఎంపీ మిథున్ రెడ్డిని అక్రమంగా కేసులు బనాయించి అరెస్టులు చేసిందని టిడిపి ప్రభుత్వంపై మండిపడ్డారు. పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డి రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి బెయిల్ పై విడుదల అవడంపై సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం కువైట్ మాలియా ప్రాంతంలో కమిటీ సభ్యులు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో గల్ఫ్ అడ్వైజర్ నాయిని మహేష్ రెడ్డి, కువైట్ కో కన్వీనరు మన్నూరు చంద్రశేఖర్ రెడ్డి, గల్ఫ్ ప్రతినిధి నాగిరెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు షేక్ రహమతుల్లా నాయకులు పూలపుత్తూరు సురేష్ కుమార్, రెడ్డి కమిటీ సభ్యులు అప్సర్ అలీ, అబ్బాస్, కిషోర్, హనుమంత రెడ్డి, షేక్ ముస్తఫా, షఫీ పాల్గొన్నారు.

## శ్రీ సత్యమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే

పీలేరు సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :



శ్రీ సత్యమ్మ తల్లిని దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే

నియోజకవర్గంలోని వాల్మీకిపురం మండలం గండ బోయినపల్లి గ్రామం కోటలో ఉన్న శ్రీ సత్తెమ్మ తల్లిని తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. దసరా శరన్నవ రాత్రుల ఉత్సవాలు జరుగు తుండడంతో రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు, శ్రీ సత్యమ్మ తల్లి ఆలయ చైర్మన్ పులి సత్యనారాయణ రెడ్డి పిలుపుమేరకు ఎమ్మెల్యే శ్రీ సత్యమ్మ తల్లి సన్నిధికి చేరుకున్నారు. అనంతరం శ్రీ దుర్గమ్మ అవతారంలో ఉన్న శ్రీ సత్యమ్మ తల్లిని దర్శించుకున్నారు. అలాగే ఆ సత్యమ్మ తల్లి అనుగ్రహంతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిరంజన్‌రెడ్డి, చక్రపాణి, ప్రభాకర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఓబుల్‌రెడ్డి, చిన్నపరెడ్డి, గ్రామ సర్పంచ్ గుర్రప్ప, రమేష్, బాబు, హరి, శేఖర తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఆర్ఎంపీ వైద్యులు

దువ్వూరు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులో ఇటీవల ప్రథమ చికిత్స కేంద్రాలపై ఫిర్యాదులు రావడంతో జిల్లా వైద్య శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి పలు ఆర్ఎంపి కేంద్రాలను మూసివేయడం అలాగే కొన్నిటికి నోటీసులు ఇవ్వడం జరిగింది. దీంతో దువ్వూరులోని ప్రథమ చికిత్స కేంద్రాలు మూసివేయడం జరిగింది. దీంతో ప్రొద్దుటూరులో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ను దువ్వూరు మండలంలోని ఆర్ఎంపీ డాక్టర్లు కలిశారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ వైద్యుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపి చికిత్స విధివిధానాలపై అధికారులతో చర్చిస్తామని ఈ విషయాన్నీ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకువెళ్తామన్నారు. ఆర్ఎంపీలు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందజేస్తున్నామని తమకు గుర్తింపు ని ఇవ్వాలని కోరారు. ఆర్ఎంపీ డాక్టర్లు తమ విధి విధానాలు గుర్తించి వైద్య సేవలు అందజేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ విషయాలపై జిల్లా వైద్య శాఖ అధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

